క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాకాల : విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీ నరేంద్ర తెలిపారు. పాకాల సబ్ స్టేషన్ పరిధిలోని పాకాల టౌన్, భారతంమిట్ట, గుట్టకింద ఇండ్లు, చెన్నుగారిపల్లి పంచాయతీ, బందార్లపల్లి, ఇరంగారిపల్లి, సామిరెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

29 నుంచి వేసవి యోగా శిక్షణ శిబిరం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఈ నెల 29 నుంచి జూన్ 17వ తేదీ వరకు వేసవి యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. 12 ఏళ్లు దాటిన వారు అర్హులని, 20 రోజుల శిక్షణకు రూ.200 ఫీజు చెల్లించాలని వర్సిటీ అధికారులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 9247210327, 9110503203లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పాకాల : క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు నర్సారెడ్డి తెలిపారు. మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం టాటా క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ రాబోయే కాలంలో క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన రోగా నుంచి ఎలా కాపాడుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రంలో రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు, నాయకులు మురళీయాద్, శ్రవణం ఫుడ్స్ ప్రొప్రైటర్ పవన్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



చంద్రగిరి(తిరుపతి రూరల్): సత్యప్రమాణాలకు నెలవైన మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి భక్తుడైన డాక్టర్ గుర్రాల శ్రీనివాసులు కుటుంబ సభ్యులు జ్యోతి, మిథున్, తరుణ్ స్వయంగా అన్నప్రసాదాలను అందించారు. వారు అమ్మవారికి సమర్పించిన సారెను ఆలయ పాలకమండలి సభ్యులు వేమారెడ్డి స్వీకరించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవాలకు అంకురార్పణ



ఉత్సవాలకు పతాకాన్ని ఆవిష్కరిస్తున్న భక్తులు

భాకరాపేట : రంగన్నగారిగడ్డ పంచాయతీ తొగటపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవానికి శుక్రవారం సాయంత్రం అంకురార్పణ శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ పతాకాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, బోనాల సమర్పణ, జ్యోతుల తయారి, ఊంజలసేవ, పుష్పపల్లకి ఊరేగింపు, ఆదివారం సాయంత్రం జ్యోతి ప్రసాద వితరణ ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



కన్నడ సినీ నటి నిస్విక నాయుడు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్ కుమార్, ఎమ్మెల్సీలు ప్రభాకర్, సుంకరరాజు, సిపాయి సుబ్రహ్మణ్యం, పి.రఘువర్మ, కన్నడ సినీ నటి నిస్విక నాయుడు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

● కొనసాగుతున్న రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులతోపాటు వారాంతం కావడంతో శ్రీవారిని దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. శుక్రవారం క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూ శిలాతోరణం వరకు చేరుకుంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా టీటీడీ అధికారులు అన్ని చర్యలూ తీసుకున్నారు. క్యూల వద్దే వారికి తాగునీరు అందజేస్తున్నారు.

\- తిరుమల



ఆలయం ముందు ఉన్న భక్తులు





స్వామి వారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



స్వామి వారి దర్శనం అనంతరం వెలుపలకు వస్తున్న భక్తులు

గంగమ్మ సేవలో మంత్రి రోజా



గంగమ్మను దర్శించుకుంటున్న మంత్రి రోజా



టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి సతీమణి వైవీ.స్వర్ణలత

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మను శుక్రవారం రాష్ట్ర మంత్రి ఆర్కే.రోజా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు, పసుపు, కుంకుమ, చీర, గాజులు అందజేశారు. అలాగే అమ్మవారిని టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి సతీమణి వైవీ.స్వర్ణలత దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆమెకు అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం పసుపు, కుంకుమ, గాజులు, చీర, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా శుక్రవారం కావడంతో తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు.

గంగ జాతరపై రాజకీయాలు దారుణం



మాట్లాడుతున్న కార్పొరేటర్ మబ్బు శేఖర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరపై రాజకీయాలు చేయడం మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు తగదని కార్పొరేటర్లు మబ్బు శేఖర్‌రెడ్డి, మునిరామిరెడ్డి ధ్వజమెత్తారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి గ్రామదేవత గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా చేయడంతోపాటు అత్యంత వైభవంగా నిర్వహించిన ఘనత ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి దక్కిందన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం, జగద్గురువులు కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, శారదాపీఠం స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి సూచనలతో ఆలయ నిర్మాణం, జాతరను అద్భుతంగా చేపట్టారని తెలిపారు. దీన్ని చూసి ఓర్వలేని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ జాతర వేడుకల నిర్వహణ, ఆలయ నిర్మాణంపై సిగ్గుమాలిన విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. సుగుణమ్మ, ఆమె భర్త వెంకటరమణ ప్రజాప్రతినిధులుగా ఉన్న సమయంలో ఏనాడూ గంగమ్మ ఆలయ పవిత్రత, గంగమ్మ విశిష్టత గురించి మాట్లాడిన పాపాన పోలేదన్నారు. దోచుకోవడం దాచుకోవడమే వారు చేశారని ఆరోపించారు. నగరాన్ని అభివృద్ధి చేసినా, ఒక చారిత్రక అంశాన్ని విస్తృతం చేసినా నిందలు వేసి అబాసుపాలు చేయాలని కుట్రలకు తెరలేపడం టీడీపీ నేతల నైజంగా మారిందన్నారు. గంగమ్మజాతర విషయంలో విషపు ప్రచారం చేస్తే అమ్మవారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యుడు వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్‌సీపీ నేతలు దూది శివ, శరవణ, మాధవ నాయుడు, పాండు పాల్గొన్నారు.

నేడు బీసీ ఉద్యోగుల సమావేశం



మాట్లాడుతున్న మునిబాలకుమార్

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య సారథ్యంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఎస్వీయూనివర్సిటీలోని సెనేట్ హాల్లో ఉద్యోగుల సమావేశం నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునిబాలకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు, బీసీ ఉద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీసీలందరినీ ఒకే వేదికపైకి తెచ్చి సమస్యలపై చర్చిస్తామన్నారు. అనంతరం బీసీ సమస్యలను ఆర్ క్రిష్ణయ్య నాయకత్వంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. బీసీలు, బీసీ ఉద్యోగులందరూ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీసీ సంఘర్షణ సమితి గౌరవాధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, నాయకులు రవీంద్రబాబు, రాజ్‌కుమార్ యాదవ్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

యానాది గుడిసెలు దగ్ధం



అగ్నికి ఆహుతి అయిన యానాది గుడిసెలు



బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న సర్పంచ్ బాబీ, అధికారులు

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం చింతగుంట పంచాయతీ యానాది కాలనీలో ఉన్న యానాదుల గుడిసెలు నాలుగు శుక్రవారం కాలిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి గుడిసెలకు మంటలు అంటుకున్నాయి. గమనించి అర్పేలోపు నాలుగు గుడిసెలు కాలిపోయాయి. వాటిలో ఉన్న చూకూరి నాగరాజు, అంజి, పొంతగిరి నాగరాజ, పొంతగిరి చౌడమ్మ కట్టు బట్టలతో బయట పడ్డారు. ఒక ద్విచక్ర వాహనం కూడా దగ్ధమైంది. మంటలకు సర్వం కోల్పోయిన యానాదులకు చింతగుంట సర్పంచ్ బాబి ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి రూ.5000, నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, బట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దస్తగిరి, వైఎస్సార్ సీపీ నాయకులు చింటూ, వీఆర్వో పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి



ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన ఏనుగులు

పాకాల : మండలంలోని కాకర్లవారిపల్లి పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలపై ఏనుగులు దాడి చేసి పనస, మామిడి, అరటి తోటలను నాశనం చేశాయి. అలాగే ఐరాల మండలం గూబలవారిపల్లి, చుక్కావారిపల్లిలో కూడా పంటలను నష్టం చేశాయి. డీఆర్‌ఓ జయశంకర్ శుక్రవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. రైతులకు నష్టపరిహారం అందించడానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సిటీ ఆపరేషన్ సెంటర్ పనుల పరిశీలన



సీవోసీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: సీవోసీ (సిటీ ఆపరేషన్ సెంటర్) నిర్మాణ పనులను శుక్రవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.80 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో సీవోసీని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇది పూర్తయితే ఆధ్యాత్మిక నగరానికి ఐకాన్‌గా నిలుస్తుందన్నారు. పనులు ఆలస్యంగా జరుగుతుండడంపై పలు సూచనలు చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్ఈ మోహన్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, డీఈ దేవిక, ఏయికామ్స్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 26 నుంచి జూన్ 3వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. 25వ తేదీ సాయంత్రం అంకురార్పణ చేపట్టనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి. 26న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేష వాహనం, 27న చిన్నశేషవాహనం, హంస వాహనం, 28న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, 29న కల్పవృక్షవాహనం, సర్వభూపాల వాహన సేవలు ఉంటాయి. 30న మోహినీ అవతారం, గరుడ వాహనంపై స్వామి వారు విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. 31న హనుమంత వాహనం, గజవాహనం, జూన్ 1వ తేదీన సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు నిర్వహిస్తారు. 2వ తేదీ ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, 3వ తేదీ ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

క్యాన్సర్ నివారణ చర్యలు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా చేపట్టి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం జిల్లా క్యాన్సర్ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 691 సచివాలయా ల పరిధిలోని ఏఎన్ఎంలు, విలేజ్ హెల్త్ క్లినిక్ అసిస్టెంట్లకు 40 మంది వంతున సోమవారం నుంచి శనివారం వరకు శిక్షణ ఇవ్వాలన్నారు. పొగాకు నమలడం, ఆల్కాహాల్ తాగడం తదితర అలవాట్లు ఉన్నవారిని గుర్తించి పరీక్షలు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. టాటా క్యాన్సర్, స్విమ్స్ ఆసుపత్రుల సహకారంతో పింక్ బస్‌ల ద్వారా పరీక్షలు చేస్తున్నట్టు చెప్పారు. శ్రీకాళహస్తి, గూడూరు, చంద్రగిరి పీహెచ్‌సీల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, డీఎంహెచ్‌వో శ్రీహరి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, టాటా క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బిడ్డను కాపాడండి



మాట్లాడుతున్న బిడ్డ తండ్రి వి.శివకుమార్

తిరుపతి కల్చరల్: గొంతులో అమర్చిన పైపుతో శ్వాస తీసుకుంటూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తమ బిడ్డకు వైద్య చికిత్స కోసం దాతలు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని తల్లిదండ్రులు వీ.శివకుమార్, ఝాన్సీరాణి వేడుకున్నారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 'మాది యాదమరి మండలం కీనాటంపల్లి గ్రామం. కూలిపనులు చేసుకుని బతుకులీడుస్తున్నాం. మా బిడ్డ హర్షిత (3)కు ఆరో నెల టీకా వేయించినప్పుడు తీవ్ర జ్వరం వచ్చింది. తర్వాత మూర్ఛ వచ్చింది. అప్పటి నుంచి మూర్ఛతో అల్లాడి పోయేది. బిడ్డను కాపాడుకోవడానికి ఇప్పటి వరకు రూ.12 లక్షలు ఖర్చుచేశాం. వేలూరు సీఎంసీలోనూ చికిత్స చేయిస్తున్నాం. శ్వాస తీసుకునేందుకు గొంతుకు అమర్చిన పైపు కారణంగా ఇన్ఫెక్షన్ సోకింది. ఆపరేషన్‌కు మరో రూ.6 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెబుతున్నారు. అంత స్థోమత లేక.. కళ్లెదుటే అల్లాడుతున్న బిడ్డను చూడలేక తీవ్ర ఆవేదన చెందుతున్నాము. దాతలు దయతలచి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి. దాతలు 8197753717ను సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నాము' అని తెలిపారు.

వేణుగోపాలస్వామి సేవలో భూమన అభినయ్‌రెడ్డి

కార్వేటినగరం: మండల కేంద్రంలో వెలసిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని శుక్రవారం తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనలు, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సాయికుమార్, నాగయ్య, టీటీడీ సిబ్బంది పలువురు ఉన్నారు.

ఘనంగా గంగమ్మకు పూజలు



శ్రీధనకోటి గంగమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

తిరుపతి కల్చరల్: రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంలోని శ్రీధనకోటి గంగమ్మ ఆలయంలో శుక్రవారం గంగజాతర పూజా మహోత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మది మహిళలతో వేద మంత్రోచ్ఛరణల నడుమ గంగమ్మను విశేషంగా అలంకరించారు. అనంతరం పూజలో పాల్గొన్న మహిళలకు ప్రసాదాలు, గాజులు, పసుపుదారం, కుంకుమ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాస్ పొదుపు సంఘాల డైరెక్టర్ వి.నాగరాజు, ఆలయ చైర్మన్ రంగారెడ్డి, నారాయణ, రాస్ సిబ్బంది నాగేశ్వర్, ఈశ్వరి, సుజాత, తులసమ్మ పాల్గొన్నారు.

రూ.10 లక్షల విరాళం



టీటీడీ ఈవోకు చెక్కును అందజేస్తున్న సంస్థ ప్రతినిధి

తిరుపతి తుడా: ఒడిశాకు చెందిన శివం కాండేవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని అందించింది. డీడీని సంస్థ తిరుపతి ప్రతినిధి రాఘవేంద్ర శుక్రవారం టీటీడీ పరిపాలన భవనంలో టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డికి అందజేశారు. బర్డ్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

పీడిత ప్రజల పక్షపాతి పుచ్చలపల్లి సుందరయ్య

తిరుపతి కల్చరల్: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పీడిత ప్రజల పక్షపాతిగా జీవించారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందారపు మురళి తెలిపారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందారపు మురళి మాట్లాడుతూ అగ్రకులంలో జన్మించిన పుచ్చలపల్లి సుందర రామిరెడ్డి పేరులో రెడ్డి పదాన్ని తొలగించి సుందరయ్యగా ప్రజల్లో జీవించారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమానికి పిల్లలు ఆటంకం అవుతారనే ఉద్దేశంతో ఆపరేషన్ చేయించుకున్న ధన్యజీవి అని గుర్తు చేశారు. దేశంలో ప్రమాదకరంగా మారిన బీజేపీని ఎదుర్కోవడం ద్వారా సుందరయ్యకు నిజమైన నివాళి అర్పించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలలకు స్మార్ట్ టీవీలు

పాకాల : మండలంలోని మన బడి నాడు-నేడు పాఠశాలలకు ప్రభుత్వం స్మార్ట్ టీవీలు మంజూరుచేస్తోందని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్ టీవీల కోసం హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌లో వివరాలు అప్లోడ్ చేయాలని సూచించారు. నాడు-నేడు కింద మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌తో కలిసి అంచనాలు వేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని, తద్వారా నగదు నాడు-నేడు ఖాతాకు జమ అవుతుందని వివరించారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేయాలన్నారు.